



నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ కార్యాలయం ఉన్న సమీకృత భవనం

జడ్పీలో ఇక కాంగ్రెస్ ఆధిపత్యం

- నాగర్‌కర్నూల్‌లో చక్రం తిప్పిన వైస్ చైర్మన్ఠాకూర్ బాలాజీసింగ్
- 11కు చేరిన కాంగ్రెస్ జడ్పీటీసీ సభ్యుల సంఖ్య
- హస్తంతో టచ్‌లో మరో ముగ్గురు బీఆర్ఎస్ సభ్యులు
- ప్రస్తుత చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కాంగ్రెస్ వశం కాబోతోంది. బీఆర్ఎస్‌కు జిల్లా పరిషత్‌లో స్పష్టమైన ఆధిక్యం ఉన్నప్పటికీ మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆ పార్టీ బలహీన పడింది. 20 మంది సభ్యులున్న జిల్లా పరిషత్‌లో కాంగ్రెస్ బలం నలుగురు సభ్యులు మాత్రమే. క్రమంగా ఆ సంఖ్య మారుతూ వచ్చింది. కసిరెడ్డి నారాయణరెడ్డి తోపాటు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పావులు కదిపి బీఆర్ఎస్‌కు చెందిన అచ్చంపేట, ఉప్పునుంతల జడ్పీటీసీ సభ్యులు మత్రునాయక్, ప్రతాప్‌రెడ్డిలను కాంగ్రెస్ గూటికి చేర్చారు. ఆ తర్వాత బిజినేపల్లి బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యుడు హరిచరణ్‌రెడ్డి హస్తం గూటికి చేరగా.. జూపల్లి కృష్ణారావుతోపాటు కోడేరు, కొల్లాపూర్ జడ్పీటీసీ సభ్యులు కూడా హస్తం కండువా కప్పుకున్నారు. దీంతో కాంగ్రెస్ జడ్పీటీసీల బలం 11కు చేరింది. మరో ముగ్గురు బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు కూడా హస్తం గూటికీ చేరాలనుకుంటున్న నేపథ్యంలో సంఖ్యా బలాన్ని అంచనా వేసిన కాంగ్రెస్ అధిష్ఠానం ప్రస్తుత జడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారిపై అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ప్రధాన అనుచరులైన కొందరు జడ్పీటీసీలు జడ్పీ చైర్‌పర్సన్ అవిశ్వాసనానికి సంబంధించిన నోటీసును సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఈ క్రమంలో శనివారం 11 మంది జడ్పీటీసీల సంతకాలతో కూడిన లేఖను కలెక్టర్‌కు పంపడానికి రెడీ చేశారు.

సుమిత్రకే చైర్‌పర్సన్ అవకాశం

మెజారిటీ జడ్పీటీసీ సభ్యులు కాంగ్రెస్ పక్షాన చేరిన నేపథ్యంలో తెలకపల్లి జడ్పీటీసీ సభ్యురాలు సుమిత్రకు చైర్‌పర్సన్ అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. ఎస్సీలకు రిజర్వ్ చేయబడిన నాగర్‌కర్నూల్ జడ్పీ చైర్‌పర్సన్ పదవిని తెలకపల్లి నుంచి ప్రాతినిధ్యం వహించిన పద్మావతి బంగారయ్య చేపట్టారు. అయితే ముగ్గురు సంతానం విషయంలో ఆమెపై అనర్హత వేటు పడింది. ఆ తర్వాత ఆ పదవి ఎంపీ రాములు తనయుడు భరత్‌ప్రసాద్‌ను వరిస్తుందని ఆశించగా.. అనేక కారణాల దృష్ట్యా జిల్లాతో సంబంధం లేని ఊర్కొండ జడ్పీటీసీ సభ్యురాలు శాంతాకుమారికి దక్కింది. అయితే ప్రస్తుతం మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో కూచకుళ్ల దామోదర్‌రెడ్డి జడ్పీ చైర్‌పర్సన్‌గా తెలకపల్లికి చెందిన సుమిత్రకు అవకాశం కల్పించాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుత జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి అడుగులు వేస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.



ఉమామహేశ్వర ఆలయం ముందు ధ్వజస్తంభం వద్ద భక్తజన సందోహం



అలంపూర్ జోగుళాంబ ఆలయం వద్ద భక్తులు



పాలమూరులో సెల్ఫీ దిగుతూ..

కొత్త బంగారులోకం..

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పార్కులు కిటకిట

మహబూబ్‌నగర్/అచ్చంపేటఅర్బన్/బిజినేపల్లి, జనవరి 1: కొత్త సంవత్సరం వేడుకలను ఉమ్మడి జిల్లా ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. 2023కు గుడ్‌బై చెప్పి.. కొత్త సంవత్సరానికి కోటి ఆశలతో స్వాగతం పలికారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉమామహేశ్వరం, మహబూబ్‌నగర్ జిల్లాలోని కురుమూర్తి, మన్యంకొండ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉమామహేశ్వరం ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక నుంచి కూడా భక్తులు తరలొచ్చారు. 15 వేలకుపైగా భక్తులు రావడంతో వాహనాలు కొండపైకి వెళ్లకుండా ఆపేశారు. కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. ఉమామహేశ్వరంతో పాటు పలు ఆలయాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. బిజినేపల్లి మండలం వట్టెం వెంకన్న సన్నిధిలో బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి బంగారు శ్రుతి ప్రత్యేక పూజలు చేశారు. పాలెం, వట్టెం, నంది వడ్డెమాన్ లలోని ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ దేవాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, సాంబశివాలయం, కందూరు, గంగాపురం ఆలయాలకు కూడా భక్తులు అధిక సంఖ్యలో రావడంతో దర్శనం కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. మహబూబ్‌నగర్ సమీపంలోని కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్‌కు జనం వేలాదిగా రావడంతో కిక్కిరిసింది.



మహబూబ్‌నగర్‌లోని పిల్లల మర్రికి తరలొస్తున్న పర్యాటకులు



మహబూబ్‌నగర్‌లోని సాంబశివ ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



వట్టెం వెంకన్న సన్నిధిలో బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బంగారు శ్రుతి

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

- వనపర్తి మునిసిపాలిటీలో ఇరు పార్టీల నాయకుల వాగ్వాదం
- డబ్బాల ఏర్పాటుకు డబ్బుల విషయంలో తీవ్ర దుమారం
- చైర్మన్ డబ్బులు తీసుకున్నారని కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

వనపర్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వనపర్తి మునిసిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. రాజీవ్ చౌరస్తాలో వీధివ్యాపారుల కోసం ఏళ్ల నుంచి డబ్బాలు ఉండేవి. రోడ్ల విస్తరణలో భాగంగా వాటిని తొలగించారు. అక్కడే ఉన్న కాలువను రెండు వరుసలుగా విస్తరించి, దానిపై ఫ్లోరింగ్ వేసి.. డబ్బాలు కట్టిస్తామని సదరు వ్యాపారులకు చెప్పారు. అయితే ఆ సమయంలో అఖిల పక్ష ఐక్యవేదిక తరఫున నిరసన తెలపగా.. రెండు వరుసల్లో డ్రైనేజీ విస్తరణ ఆగిపోయింది. తర్వాత ఎన్నికలు రావడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం చకచక జరిగిపోయాయి. మునిసిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ పాలకవర్గమే ఉండటంతో.. డ్రైనేజీ నిర్మిస్తామని చెప్పిన స్థలంలో వ్యాపారులే మొరం వేసి, డబ్బాలు ఏర్పాటు చేసేందుకు జేసీబీతో సోమవారం పనులు ప్రారంభించారు. దీనిపై అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు పనులను అడ్డుకున్నారు. డబ్బాల ఏర్పాటు విషయంలో తీవ్ర అవినీతి జరిగిందని, తాము ఎన్నికల సమయంలో చెప్పినట్లుగానే అవినీతిని బట్టబయలు చేస్తామని ప్రకటించారు. ఒక్కో చిరువ్యాపారి దగ్గర మునిసిపల్ చైర్మన్ గట్టు యాదవ్ రూ. 50 వేల చొప్పున డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. డబ్బాల ఏర్పాటుకు డబ్బులు ఇచ్చిన వారితో కూడా మాట్లాడారు. మునిసిపాలిటీలో ఏదైనా నిర్మాణం చేయాలని డబ్బులు సేకరించినా.. అధికారికంగా జరగాలని, డబ్బులు చెల్లించిన వారికి రశీదు ఇవ్వడంతోపాటు టెండర్ ద్వారా పనులు కట్టబెట్టి చిరువ్యాపారులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అలా కాకుండా మునిసిపాలిటీ స్థలాన్ని తన సొంత ఆస్తిలాగా వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేయడం, తానే నిర్మాణాలు చేయిస్తానని చెప్పడమే అవినీతి నిదర్శనమని అన్నారు. వ్యాపారుల డబ్బులు వారికి తిరిగి ఇవ్వడంతోపాటు.. ఆ స్థలంలో కాంప్లెక్స్ నిర్మించి వారికి షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చైర్మన్ రాజీవ్ చౌరస్తాకు వచ్చి తన నీతిని నిరూపించుకోవాలని కాంగ్రెస్ నాయకుడు సతీష్ డిమాండ్ చేశారు.



పనులను అడ్డుకొని మాట్లాడుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు

డబ్బులు తీసుకోలేదు: మునిసిపల్ చైర్మన్

చిరువ్యాపారులు చైర్మన్ వద్దకు వెళ్లగా వారిని సముదాయించి.. ఆయన రాజీవ్ చౌరస్తాకు వచ్చారు. దీంతో రాజీవ్ చౌరస్తాలో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. సాగుతున్న అభివృద్ధికి సహకరించాలే కానీ.. అపోహలు, తప్పుడు ఆరోపణలతో అభివృద్ధిని కప్పిపుచ్చవద్దని, కాంగ్రెస్ ఆరాచకాలను అడ్డుకుంటామని చైర్మన్ గట్టుయాదవ్ తెలిపారు. తాను చిరువ్యాపారుల వద్ద డబ్బులు తీసుకోలేదని, తొలగించిన డబ్బాల స్థానంలో మళ్లీ నిర్మించుకుంటామంటే.. తన ముందు మేస్త్రీకి బయానా ఇచ్చారని తెలిపారు. ఎన్నికలు రావడంతో కొంత ఆలస్యం జరిగిందని, దాన్ని కాంగ్రెస్ నాయకులు లంచంగా చెబుతున్నారని అన్నారు. అయితే ఈ సమయంలో ఇరు పార్టీల నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు తోసుకున్నారు. పోలీసులు కలగజేసుకున్నా రాజీవ్ చౌరస్తాలో గలాట చేయడంతో చర్చనీయాంశంగా మారింది. అయితే డబ్బుల వసూలు విషయంలో విచారణ చేయిస్తామని, ఇవే కాకుండా ఎక్కడెక్కడ డబ్బులు వసూలు చేశారు?, అవినీతి ఏం జరిగిందన్నది ప్రతీ ఒక్కటి బయటికి లాగుతామని, తిన్న సొమ్ము మొత్తం కక్కిస్తామని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

విలువల విద్య..

- మొంటెసోరి విద్యావిధానంతో నేర్పుతున్న పాఠం ఇదే..
- ప్రాథమిక దశలోనే కార్యాచరణ ఆధారిత విద్య అవసరం
- ఔట్ రీచ్ ప్రోగ్రాం ద్వారా ఈ విధానం అమలుకు శిక్షణ
- గోపాల్‌పేటలో 72 మందికి పది రోజుల పాటు ట్రైనింగ్
- ఈ విధానం విస్తరణతో దేశ శాంతికి చిన్నతనంలోనే బీజాలు
- అంగన్‌వాడీలు, తల్లుల అవగాహన కోసం కార్యక్రమాలు



మొంటెసోరి విద్యా విధానం శిక్షణకు హాజరైన మహిళలు; శిక్షణ ఇస్తున్న ఏఎంఐ సర్టిఫైడ్ ట్రైనర్ మాధవి రవీంద్ర

వనపర్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పిల్లలను దేవుళ్లతో పోల్చారు. ఏ పిల్లాడి బాల్యం అద్భుతంగా సాగుతుందో ఆ పిల్లాడు సామాజిక స్పృహ కలిగిన వ్యక్తిగా తయారవుతాడు. చిన్నతనం నుంచే విలువలతో కూడిన కార్యాచరణ ఆధారిత విద్యను పిల్లలకు అందించగలిగితే వారు భావి భారత పౌరులుగా విభిన్నరంగాల్లో రాణించడానికి అవకాశం ఏర్పడుతుంది. దేశంలో మెజారిటీ తల్లిదండ్రులు ప్రస్తుతం ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేస్తూ, ఉన్నత విద్యలో తమ పిల్లలు రాణించాలని కోరుకుంటున్నారు. దీనివల్ల పిల్లల్లో మానసిక ఒత్తిడి పెరుగుతోంది. తనను తాను తీర్చిదిద్దుకోవడానికి అవకాశం ఇవ్వకుండా చేసే విద్యా విధానం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. పాత విధానాన్ని మార్చి, మొంటెసోరి విద్యావిధానం అమలు కోసం నెదార్లాండ్ హెడ్‌క్వార్టర్‌గా ఏఎంఐ(అసోసియేట్ మొంటెసోరి ఇంటర్నేషనల్) సంస్థ పని చేస్తోంది. ప్రాథమిక దశలోనే విద్యార్థులను తీర్చిదిద్దడం లక్ష్యంగా పని చేస్తున్న ఈ సంస్థ.. ఓ నూతన సంకల్పాన్ని తీసుకుంది. ఇప్పటివరకు ఈ విధానంలో హైదరాబాద్‌లో 60కి పైగా పాఠశాలలు నడుస్తుండగా, విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఔత్సాహికులను ప్రోత్సహించి కొత్తగా పాఠశాలలు నెలకొల్పడం లేదా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో ఈ విధానాన్ని అమలు చేయడం దిశగా ఆలోచన చేస్తోంది. అందులో భాగంగా వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో మొంటెసోరి విద్యా విధానంలో నడుస్తున్న తొలకరి చినుకులు పాఠశాలలో పది రోజుల పాటు రాష్ట్రంలోనే ఏకైక తెలుగు ఏఎంఐ సర్టిఫైడ్ ట్రైనర్ అయిన మాధవి రవీంద్ర శిక్షణ ఇచ్చారు. మొక్కై వంగనిది మానై వంగునా అనే మోటో లక్ష్యంగా పని చేస్తున్న వారి శిక్షణ విధానాన్ని 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. ఇందులో భాగంగా ట్రెయినర్ మాధవి రవీంద్ర, తొలకరి చినుకులు పాఠశాల నిర్వహకురాలు పరిమళ, శిక్షణ పొందిన మహిళలను పలకరించింది.

మొంటెసోరి లక్ష్యం ఇదే..



రెండో ప్రపంచ యుద్ధ కాలంలో దేశం నుంచి బహిష్కరణకు గురైన మొంటెసోరి అనే విద్యావేత్తను జెంషెడ్ టాటా ఇండియాకు రప్పించారు. మహాత్మ గాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్.. విద్యావిధానంలో మార్పుల కోసం కన్న కలలకు మొంటెసోరి ఒక సాంకేతిక రూపం తెచ్చారు. పిల్లలు తమ చుట్టూ ఉన్న పరిసరాలను గమనిస్తూ స్వతహాగా నేర్చుకోవడం, క్రమశిక్షణ అలవర్చుకోవడం ఈ విధానం ప్రధాన లక్ష్యం. ఇందులో 0-3 ఎలిమెంట్రీ, 3-6 అంగన్‌వాడీ దశల్లోనే బీజం పడాల్సిన అవసరం ఉంటుంది. చిన్నతనం నుంచే పిల్లలు అనుకరణ పద్ధతిలో ఎవరు ఏమీ నేర్పకపోయినా మాతృభాషను, ఇతర పనులను నేర్చుకుంటారు. వారు చాలా ఏకాగ్రతతో తమను తాము మలుచుకోవడానికి ప్రయత్నిస్తుంటారు. 0-6 సంవత్సరాల మధ్య వయసులోనే మెదడు పరిపూర్ణంగా తయారవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలు స్వతహాగా నేర్చుకోకుండా.. ఇంట్లో, పాఠశాలలో నియంత్రణ కొనసాగుతోంది. దీనివల్ల సామాజిక, శారీరక, భావోద్వేగ, ఆర్థిక ఎదుగుదల మందగిస్తోంది. మొంటెసోరి విద్యా విధానంలో గురువులు కేవలం చదువు మాత్రమే కాకుండా పిల్లాడు పరిపూర్ణమైన మనిషిగా మారడం కోసం చిన్నతనం నుంచే బీజాలు వేస్తారు. ఆ వయసు పిల్లలకు పరిసరాలు అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తారు. పిల్లలను కొట్టడం, తిట్టడం ద్వారా మెరుగవుతారని అనుకోవడం సరైన పద్ధతి కాదు. వారు స్వతహాగా నేర్చుకునే విధానం కలిగి ఉంటారు. మనం చేయాల్సిందల్లా అందుకు అనుగుణంగా పరిసరాలను సిద్ధం చేయాలి. అలాగే వారు చెప్పింది వినాలి. కేవలం మార్క్ షీట్ల ఆధారంగా విద్యార్థి ప్రగతి సాధించారని మాత్రం అనుకోవద్దు. ప్రస్తుతం తెలంగాణలో ఈ విధానంలో సర్టిఫైడ్ ట్రెయినర్లు ముగ్గురు ఉండగా.. తెలుగులో నేను శిక్షణ ఇవ్వగలుగుతున్నాను. ఏఎంఐ ఔట్ రీచ్ ప్రోగ్రాం ద్వారా ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి, ఈ విద్యా విధానం అమలు చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతం వనపర్తి జిల్లాలో 72 మంది మహిళలకు ఈ విధానం కింద పది రోజుల పాటు శిక్షణ ఇచ్చాం. నేను వృత్తిపరంగా న్యాయవాదిని అయినప్పటికీ.. ఈ విద్యా విధానం వ్యాప్తి చెందితే సమాజ మేలు జరుగుతుందనే ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. ప్రస్తుతం కొత్తగా వచ్చిన జాతీయ విద్యా విధానంలో కూడా కార్యాచరణ ఆధారిత విద్యను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు.

- మాధవీ రవీంద్ర, ఏఎంఐ సర్టిఫైడ్ ట్రెయినర్

పిల్లాడు ఒక మనిషి తండ్రిలాంటివాడు



మొంటెసోరి విద్యా విధానం అనేది ఎక్కువగా కార్యాచరణ ఆధారిత విద్యపై ఆధారపడి ఉంటుంది. ఒక పరిపూర్ణమైన మనిషి తయారవ్వాలంటే పిల్లాడి దశ నుంచే ప్రారంభం కావాలి. మొంటెసోరి విద్యా విధానంలో చైల్డ్ ఈజ్ ఫాదర్ ఆఫ్ మ్యాన్(పిల్లాడు ఒక మనిషికి తండ్రి) లాంటి వాడని చెబుతారు. పిల్లాడి సామర్థ్యాల పెంపునకు అనుగుణంగా పరిసరాలను సమకూర్చితే వారు స్వతంత్రంగా ఎదుగుతారు. ఏది తప్పు, ఏది కాదు అనేది చిన్నతనంలో తెలిసేలా చేయాలి. ప్రాథమిక దశలోనే సరైన విద్యావిధానం అమలు చేస్తే.. యాంటీ సోషల్ ఎలిమెంట్లుగా పిల్లలు తయారు కారు. బయట, ఇంట్లో పిల్లలు నేర్చుకునే అవలక్షణాలను దూరం చేయడమే ఈ పాఠశాలల ఉద్దేశం. ఈ విధానాన్ని విస్తరించడం కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భవిష్యత్‌లో అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఈ విధానం అమలు కావాల్సిన అవసరం ఉంది. చైనాలాంటి దేశాల్లో ఈ విధానాన్ని అమలు చేయడానికి 700 మంది శిక్షకులు అందుబాటులోకి వచ్చారు.

- పరిమళ, తొలకరి చినుకులు నిర్వాహకురాలు

సమాజ మార్పు పిల్లల నుంచే ప్రారంభం



సమాజ మార్పు పిల్లల నుంచే ప్రారంభమవుతుంది. 0-6 సంవత్సరాల వయసు నుంచే మొంటెసోరి విద్యావిధానం అమలుచేస్తే.. అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. పిల్లలు ఎలా ప్రవర్తించాలనే విషయంలో నియంత్రణ పెట్టడం కంటే పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎలా ప్రవర్తించాలనే విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ప్రస్తుత విద్యా విధానంలో మార్కులే ఆధారంగా ప్రగతిని నిర్దేశిస్తున్నాం. కానీ అది కొలమానం కాదు. ఈ పది రోజుల శిక్షణలో మేము గతంలో ఎలా ఉన్నాం.. భవిష్యత్‌లో ఎలా ఉండాలనేది తెలిసింది.

- విజయలక్ష్మి, పేరెంట్, డీఎస్సీ అభ్యర్థి, వనపర్తి

చదువే జ్ఞానం కాదు



మా పిల్లలు మొంటెసోరి విద్యావిధానంలో నడుస్తున్న తొలకరి చినుకులు పాఠశాలలోనే చదువుతున్నారు. ఇందులో చదివించడం కోసమే గోపాల్‌పేటకు మేము షిఫ్ట్ అయ్యాం. చదువు మాత్రమే జ్ఞానం కాదని ఈ విద్యావిధానం నేర్పుతోంది. సమాజంలో ఎలా బతకాలి. ఏం తెలుసుకోవాలి.. చదువు కాకుండా సంగీతం, నాట్యం, కర్రసాము, కరాటే లాంటి విద్యలను కూడా ఇక్కడ నేర్పుతారు. సమాజం పట్ల ఎలా ఉండాలి, ఇతరుల పట్ల ఎలా నడుచుకోవాలి అనేది చిన్నతనం నుంచే నేర్పిస్తే దేశ సమగ్రతకు నాంది పడుతుంది.

- రేణుక, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, పేరెంట్, బిజినేపల్లి

వారే నేర్చుకునేలా ప్రోత్సహించాలి



పిల్లలు చిన్నతనం నుంచే తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలిస్తారు. వాటి ఆధారంగా తాము ఎలా ఉండాలనే విషయాలను నేర్చుకుంటారు. వారు స్వేచ్ఛగా ఉండటానికి ఇష్టపడతారు. వారికి వారే పనులు చేసుకునే విధంగా.. నేర్చుకునే విధంగా మనం పనిచేస్తే సరిపోతుంది. మేము అంగన్‌వాడీల్లో పిల్లలను కేర్ తీసుకుంటాం. వారికి ప్రాథమిక విద్యను కూడా అందిస్తాం. కానీ మొంటెసోరి విద్యా విధానం అనేది మనం నేర్పించడమే కాకుండా వారికి వారు నేర్చుకునేలా ప్రోత్సహించడమేనని చెప్పొచ్చు.

- నారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్, వనపర్తి

ఉత్తమ సేవలందించిన
పోలీసులకు సేవా పతకాలు

- ఉమ్మడి పాలమూరులో 48 మంది ఎంపిక

మహబూబ్‌నగర్, జనవరి1: పోలీస్‌శాఖలో ఉత్తవ సేవలందించిన వారికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఉత్తమ సేవా పతకాలు ప్రకటించింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అధికంగా 48 మంది పోలీసులు ఈ పథకాలకు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం విడుదల చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి.. ఏఆర్ఎస్సై కే.వెంకటకృష్ణారెడ్డి, ఏఎస్సై మన్యం అక్కని, హెడ్ కానిస్టేబుళ్ళు జనార్ధన్‌గౌడ్, ఎం రవిజయశంకర్, ఈ శ్రీనివాస్, ఎండీ సదాతుల్లా, మూలమళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఇప్ప శివారెడ్డి, పీ.కృష్ణంబాబు, వీ.రామ్ గోవర్ధన్, బి.చిన్న యాదయ్య సేవా పథకాలకు ఎంపికయ్యారు. వనపర్తి జిల్లా నుంచి అడిషనల్ ఎస్పీ టి.రామదాసు, ఏఎస్సై షేక్ మహబూబ్‌పాష, ఏఆర్ఎస్సై బి.హేమాజి, హెడ్ కానిస్టేబుళ్ల సిద్ధాంతి శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసులు, డీ.శ్రీనివాసులు, ఎండీ మోయిన్, కె.దామోదర్‌రెడ్డి, ఎం చంద్రశేఖర్, జోగుళాంబ గద్వాల నుంచి హెడ్ కానిస్టేబుల్స్ ఎన్.వీరన్న, ఎన్.విజయభాస్కర్ రాజు, టీ.జ్యోతిప్రకాశ్, జీ.కృష్ణయ్య, సీ.లక్ష్మినారాయణ ఎంపికయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఏఎస్సైలు చౌదరి ఈశ్వర్, ఎస్.బాలరాజ్, ఎండీ అస్లాంఖాన్, ఎంఏ రశీద్, ఏఆర్ఎస్సైలు ఎస్.శాంబూష, బీ.మల్లేశ్, హెడ్ కానిస్టేబుల్స్ ఎండీ జాని, మహ్మద్ మసూద్‌పాష, చింతల నారాయణ, ఎం.నాగరాజు, యాసిన్ మొయినుద్దీన్, పీ.వెంకట్‌రాముడు, ఎంఅంజయ్య, ఏ.పరశురాంగౌడ్, కే.శ్రీనివాస్, జర్యకంటి అంబిక పురేందర్‌నాథ్, గుండ్రాతి రాజన్‌గౌడ్, కానిస్టేబుల్ ఎన్.తిరుపతయ్య, ఎస్సై వేముల రామేశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. నారాయణపేట జిల్లా నుంచి ఏఆర్ఎస్సై ఎం.మల్కయ్య, హెడ్ కానిస్టేబుల్ టీ.రాంమోహన్ ఉన్నారు. వీరితోపాటు సికింద్రాబాద్‌లో ఆర్‌పీసీ పీ.వేణుగోపాల్‌కు కూడా సేవాపతకం వరించింది.

బైక్ స్తంభాన్ని ఢీకొని యువకుడి మృతి



సాయికుమార్(ఫైల్)

నవాబ్ పేట, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలు ఓ యువకుడిని బలిగొన్నాయి. అర్ధరాత్రి బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో నవాబ్‌పేటకు చెందిన ఎరుకలి సాయికుమార్(20) అక్కడికక్కడే చనిపోయాడు. సాయికుమార్ తల్లితో కలిసి నవాబ్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు టీ స్టాల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం స్నేహితులతో కలిసి అర్ధరాత్రి వరకు నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నాడు. అనంతరం బైక్‌పై మహబూబ్‌నగర్ రోడ్డు వైపు వెళ్లాడు. మార్కెట్ కార్యాలయం సమీపంలో బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దాంతో తీ వ్రంగా గాయపడ్డ సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు.

సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు

- వరినార్లు పోసి నెల రోజులు కావస్తుంది - మండల వ్యాప్తంగా గత ఖరీఫ్‌లో 7వేల ఎకరాలకు పైగా సాగు
- డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసినట్లయితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారుల సూచనలు



పొల్కూరులో వరి నాటేందుకు ఎద్దుల సహాయంతో గొర్రు కొడుతున్న అన్నదాత

తాడూరు, జనవరి 1 : మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్నదాతలు యాసంగిలో వరి పైరు సాగు చేసుకునేందుకు అన్ని విధాలా సంసిద్ధమవుతున్నారు. ప్రస్తుతం వరినార్లు పోసి 20 నుంచి నెల రోజులు కావస్తుండడంతో అక్కడక్కడ కొంతమంది రైతులు వరినాట్లు సైతం ప్రారంభించారు. గత వర్షాకాలంలో తాడూరు మండల కేంద్రంతోపాటు మండలంలోని 24గ్రామపంచాయతీల పరిధిలో 7వేల ఎకరాలకు పైగా అన్నదాతలు వరి సాగు చేయగా ప్రస్తుతం కృష్ణానదిలో సమృద్ధిగా నీరు లేకపోవడం మూలంగా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే సాగునీరు రాకపోవడంతో కాల్వల వెంట సాగు చేసే అన్నదాతలు, చెరువుల కింద సాగు చేసే వారందరూ అయోమయంలో పడ్డారు. ఏదేమైనా గత వర్షాకాలంతో పోల్చి చూసినట్లయితే ప్రస్తుతం వరి సాగు తగ్గే పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు తోడుగా ప్రభుత్వం రైతులకు అందించే పెట్టుబడి సాయం సైతం వరినాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఇంకా అందకపోవడం మూలంగా మరికొంత మంది రైతులు ఆందోళనలో ఉన్నారు. ఏదేమైనా ప్రభుత్వం సాగు పెట్టుబడి సాయాన్ని వెంటనే రైతులకు అందేలా చూసినట్లయితే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

● డ్రమ్ సీడర్‌తో రైతులు వరి విత్తనాలను విత్తుకుని సాగు చేసుకున్నట్లయితే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మండల ఏవోతోపాటు ఏఈవోలందరూ గ్రామాల్లో రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం పాలెం ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను సైతం ఏర్పాటు చేయడం జరిగింది. డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు విత్తుకుంటే తక్కువ విత్తనాలు పట్టడంతో పీలకలు ఎక్కువగా వచ్చి దిగుబడి గణనీయంగా పెరుగుతుందని అధికారులు సూచిస్తున్నారు. మొత్తంగా యాసంగిలో వరి సాగు అంతంతమాత్రంగానే ఉన్నట్లు తెలుస్తోంది.



ఎల్లిఖార్‌పల్లిలో వరి నాటేందుకు నారుమడిని సిద్ధం చేసుకున్న అన్నదాతలు

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ధన్వాడ, జనవరి 1 : మండలంలోని కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఢిల్లీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజా రాం, కోచర్ రాంమోహన్‌గౌడ్ సోమవారం తెలిపారు. జనవరి మూ డు నుంచి ఏడవ తేదీ వరకు ఢిల్లీలో జరిగే 67వ జాతీయ స్థాయి పో టీల్లో కొండాపూర్ గురుకులం మినీ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన విద్యా ర్థులు పరమేష్, సిద్ధు, అశోక్ ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా అండర్ 17 విభాగంలో అవినాష్, సిద్ధార్థ తెలంగాణ జట్టు తరపున పాల్గొననున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ రావు, నాగమణి, పీఈటీ సుగుణకర్‌రావు విద్యార్థులను అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

జడ్చర్ల, జనవరి 1 : జడ్చర్ల పట్టణంలో ఆదివారం రాత్రి పలు ప్రాంతాల్లో జడ్చర్ల పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని ఇందిరమ్మ చౌరస్తా వద్ద ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ నిర్వహించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు కొందరు యువకులు మద్యం తాగి వాహనాలతో తిరుగుతున్నారన్న సమాచారంతో డ్రైవ్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ మలుపులు యమపురికి పిలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- ఇబ్బందుల్లో వాహన చోదకులు
- పట్టించుకోని అధికారులు

పెద్దకొత్తపల్లి, జనవరి 1 : నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యం. ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్ ప్రధాన రహదారులు పలు చోట్ల అనేక మలుపులు ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పెద్దకొత్తపల్లి నుంచి కొల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దకొత్తపల్లి బాచారం బస్సు స్టేజీల మధ్య ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి.

అలాగే పెద్దకార్పాముల నుంచి వయా నాయినోనిపల్లి మీదుగా యాపట్లకు వెళ్లే రహదారిపై పెద్దకార్పాముల నుంచి మరికల్ వెళ్లే రహదారిపై ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మరికల్ వెళ్లే రహదారిపై నక్కలపల్లి బస్సు స్టేజీ నుంచి వెన్నచెర్లకు వెళ్లే రహదారిపై దేవునితిర్మలాపూర్ నుంచి వెన్నచెర్లకు వెళ్లే రహదారులపై మలుపులు ప్రమాదభరితంగా ఉన్నాయి. ఈ మలుపుల వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అంతేకాక ఎత్తు పల్లాలతో ఉండే ఈ రహదారులపై ఎన్నో మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల దగ్గర ఎన్నోమార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి మలుపుల దగ్గర ఉన్న కంపచెట్లను తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



గంట్రావుపల్లి నుంచి మహాసముద్రం వెళ్లే రహదారిపై ఉన్న మలుపు

● సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులపై ప్రమాదకరంగా మలుపులు ఉన్నాయి. మలుపుల దగ్గర ఎన్నో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు చొరవ తీసుకుని మలుపుల దగ్గర సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నా.

-బి.శ్రీనివాసులు, దేవునితిర్మలాపూర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి

ఉప్పునుంతల, జనవరి 1 : ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకోంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయ పరమేష్(30) ఆదివారం సాయంత్రం బహిర్భూమి కోసం గ్రామ సమీపంలోని ఊర చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. యువకుడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెంది ఉంటాడని గ్రామస్థులు తెలిపారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం మధ్యాహ్నం నీటిలో శవం తేలడంతో బయటికి తీసి అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య లలితతో పాటు, ఒక పాప ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఎంపీడీవో..



జయసుధ (ఫైల్)



ఎంపీడీవో జయసుధ భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, జనవరి 1: చారకొండ మండలంలో ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జయసుధ (49)కు డిసెంబరు 28న రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వెల్దండ సమీపంలోని యెన్నమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున ఆమె మృతి చెందింది. చారకొండ ఎంపీడీవోగా 2019లో బాధ్యతలు చేపట్టి సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో కలిసి పాల్గొన్నారు. ఎంపీడీవో జయసుధ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొన్న ఎమ్మెల్యే ఆమె భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంపీడీవో భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీడీవో జయసుధకు భర్త కరుణాకర్, కుమారుడు, కుతూరు ఉన్నారు.

బైకు అదుపుతప్పి బోల్తా

- ఒకరికి తీవ్ర గాయాలు



చారకొండలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెన్నకేశవులు

చారకొండ, జనవరి 1: బైక్ అదుపు తప్పి బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి సల్ప గాయాలు అయిన సంఘటన నాగర్‌కర్నూలు జిల్లా చారకొండ మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకొంది. లింగాల మండలం కొత్తగుంటపల్లి గ్రామానికి చెందిన తీగల చెన్నకేశవులు తన భార్య పల్లవి, కుమారుడు సిద్దార్థతో కలిసి హైదరాబాద్ నుంచి చారకొండకు బైక్‌పై వస్తున్నాడు. తన ఇద్దరు కుమార్తెలు చారకొండలోని కేజీబీవీ పాఠశాలలో కీర్తన, చందనలు చదువుకొంటున్నారు. వారిని చూసి వెళ్లటానికి వస్తుండగా చారకొండ మండల కేంద్రంలోని జాతీయ రాహదారిపై బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో చెన్నకేశవులుకు కుడికాలు విరిగింది. భార్య, కుమారునికి స్వల్పంగా గాయాలు అయ్యాయి. చారకొండలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేశారు. చెన్నకేశవులుకు మెరుగైన వైద్యంకోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు.

బైక్‌పై నుంచి కింద పడి వ్యక్తి మృతి



గొల్ల నాగన్న (ఫైల్

మదనాపురం, జనవరి 1 : బైక్ పైనుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొన్నూరు గ్రామానికి చెందిన గొల్ల నాగన్న(45) ఆదివారం రాత్రి తన గొర్రెల వద్దకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై బయలుదేరాడు. అమ్మాపూర్ గ్రామ రహదారిపై బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న రాయికి తగలడంతో పాటు అక్కడే ఉన్న రాళ్ల మీద పడ్డాడు. ఈ క్రమంలో తలకు, కడుపులో బలమైన గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న కొందరు గమనించి పోలీసులకు సమాచారం అందించి, 108లో ఆత్మకూర్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్యతో పాటు, కుమారుడు, కూతురు ఉన్నారు. తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని భార్య పద్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళి తెలిపారు.

మూడు రైస్‌మిల్లులపై కేసు నమోదు

పాన్‌గల్, జనవరి 1 : వరి ధాన్యం బస్తాలను పక్కదారి పట్టించిన ఘటనలో వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని మూడు రైస్ మిల్లులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వేణు తెలిపిన వివరాల ప్రకారం.. రైతులు పండించిన వరిని ప్రభుత్వం కొనుగోలు చేసి మిల్లులకు కేటాయించింది. కేటాయించిన ధాన్యం బియ్యం గా మార్చి ప్రభుత్వానికి అప్పగించాలి. అయితే, ప్రభుత్వానికి అప్పగించే బియ్యంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆయా మిల్లులపై తనిఖీలు చేపట్టారు. మండలంలోని పరమేశ్వర రైస్‌మిల్లు పాన్‌గల్‌కు 10,469 బస్తాలు, మీనాక్షి ఫుడ్ ప్రొడక్ట్ మహమ్మదాపూర్ మిల్లుల్లో 2,25,179 బస్తాలు, ఇషాన్ ఆగ్రో మహమ్మదాపూర్ మిల్లులో 39,454 బస్తాల ధాన్యం పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారుల ఫిర్యాదు మేరకు ఆయా రైస్‌మిల్లుల యజమానులు పరమేశ్వర్‌రెడ్డి, మధుకుమార్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వేణు తెలిపారు.

గొర్రెపై చిరుత దాడి

ఖిల్లాఘణపురం, జనవరి 1 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మల్కిమియాన్‌పల్లి గ్రామ శివారులో సోమవారం గొర్రెపై చిరుత దాడి చేసింది. మండలంలోని గ్రామాల్లో గత 15 రోజులుగా మండలంలో చిరుతపులి హల్‌చల్ చేస్తున్నా అటవీశాఖ అధికారులు నామమాత్రపు గాలింపు చర్యలతో వరుసగా చిరుత దాడి ఘటనలు జరుగుతున్నాయి. అటవీశాఖ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా చిరుత ఆనవాళ్లు కనబడడం లేదని ప్రచారం చేశారు. రెండు రోజుల క్రితం కుక్కపై దాడి జరగడంతో మల్కిమియాన్‌పల్లి గ్రామస్థులు చిరుత పులిని వెంటాడి పట్టుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గ్రామానికి చెందిన సుమారు 50 మంది గ్రామస్థులు కట్టెలు చేతబట్టి బోడగట్టు గుట్టపై ఉన్న గుహస్థావరాల్లో గాలించగా చిరుత ఎదురుదాడి చేయడానికి ప్రయత్నించిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అటవీశాఖ అధికారులు వెంటనే చిరుతపులిని బోనులో బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఆట వస్తువులు చోరీ

అయిజ, జనవరి 1 : అయిజ మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఆట వస్తువులు చోరీకి గురయినట్లు మండల విద్యాధికారి నర్సింహులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు తరగతి గదుల తలుపులు పగులగొట్టి, గోడలు, బ్లాక్ బోర్డులపై పిచ్చి రాతలు రాశారని తెలిపారు. ఆట వస్తువులను ఎత్తుకెళ్లారని చెప్పారు.

కోనేరులో దూకి మహిళ ఆత్మహత్య

జడ్చర్ల, జనవరి 1 : జడ్చర్ల పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలోని కోనేరులోకి దూకి పట్టణానికి చెందిన ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దేవాలయం సమీపంలోని కాలనీకి చెందిన మణెమ్మ(45) అనే మహిళ సోమవారం మధ్యాహ్నం కోనేరులోకి దూకింది. ఆమెను కోనేరులో నుంచి బయటికి తీసేలోగా మృతిచెందింది. కుటుంబంలో వాగ్వాదం కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మిడ్జిల్, జనవరి 1: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం మున్ననూర్ గ్రామ శివారులోని కేఎల్ఐ బ్రిడ్జి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..చిలువేరు గ్రామానికి చెందిన ఆంజనేయులు(25) డిసెంబరు 31 వేడుకలను తన గ్రామంలో స్నేహితులతో కలిసి జరుపుకొని అత్తగారి గ్రామం మిడ్జిల్‌లో తన భార్య రేణుక, పిల్లల వద్ద కేక్ కట్‌చేసి వస్తానని చెప్పి వెళ్లారు. అలాగే తన భార్య రేణుకకు ఫోన్ చేసి తాను వస్తున్నానని, పిల్లలను నిద్రపోనివ్వవద్దని కేక్ కట్ చేద్దామని తెలిపాడు. రాణిపేట గ్రామంలో కేక్ తీసుకొని బైక్‌పై వెళ్తూ మున్ననూర్ గ్రామ శివారులోని కేఎల్ఐ బ్రిడ్జి వద్ద రక్షణ గోడ సమీపంలో మృతి చెందాడు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన విషయాన్ని గమనించిన వాహనదారులు టోల్ ప్లాజా సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చి మృతుడి అచూకీ తెలుసుకొని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న మృతుడి భార్య రేణుక రోదన పలువురిని కంటతడి పెట్టించాయి. ప్రస్తుతం ఆమె ఆరు నెలల గర్భవతిగా ఉంది. దీంతో మిడ్జిల్ మండలం చిలువేరు, మిడ్జిల్ గ్రామాల్లో విషాదఛాయాలు అలుముకున్నాయి. మృతుడి తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శివనాగేశ్వరనాయుడు తెలిపారు. ఆంజనేయులు తనంతట తానే రక్షణగోడను ఢీకొన్నడా లేక గుర్తుతెలియని వాహనం ఢీకొన్నదా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.



ఆంజనేయులు(ఫైల్)

ముగ్గురికి గాయాలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని ఒడికే వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో సోమవారం చోటు చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రేవల్లి గ్రామానికి చెందిన అంజిరెడ్డి, మణెమ్మలు బైక్‌పై కల్వకుర్తి వైపు వెళ్తుండగా మిడ్జిల్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన మల్లేష్ వెనుక నుంచి అంజిరెడ్డి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. దాంతో గాయపడిన అంజిరెడ్డి, మణెమ్మలను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ అస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. మల్లేష్‌ను జడ్చర్ల ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై శివనాగేశ్వరనాయుడు తెలిపారు.

ఉరి వేసుకొని
ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- ఆందోళనకు దిగిన బాధిత కుటుంబ సభ్యులు
- నూతన సంవత్సరంలో విషాదం



విద్యార్థి రాంరెడ్డి (ఫైల్)

మహబూబ్‌నగర్, జనవరి 1 : ఆ విద్యార్థి అప్పటివరకు తోటి స్నేహితులతో కలిసి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. అర్ధరాత్రి దాటినంతవరకు వేడుకల్లో పాల్గొన్న ఆయన ఆ తరువాత తరగతి గదిలోకి వెళ్లి తాడుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నూతన సంవత్సరం రోజున ఈ విషాద ఘటన చోసుకోవడంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం భూనీడు గ్రామానికి చెందిన రాంరెడ్డి (18) మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని షాషాబ్‌గుట్టలో గల మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి హాస్టల్‌లో తోటి విద్యార్థులతో కలిసి న్యూఇయర్ వేడుకల్లో పాల్గొన్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తరగతి గదిలోకి వెళ్లాడు. తలుపుకు బోల్ట్ పెట్టుకొని గదిలో ఉన్న సీసీ కెమెరాను పైకి మార్చాడు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీలో కనిపించాయి. ఆ తరువాత తాడుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున కళాశాల నిర్వాహకులు మూసి ఉన్న తరగతి గదిని గమనించి తలుపును బలవంతంగా తెరిచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతున్న రాంరెడ్డిని చూసి ఖంగుతిన్నారు. వెంటనే అతన్ని కిందికు దించి స్థానిక జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. అయితే రాంరెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. తన తల్లి అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడని తెలుస్తోంది. కళాశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా తన కొడుకు చనిపోయాడని కళాశాల వద్దకు చేరుకొని తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. కేర్‌టేకర్ లేకపోవడం వల్లే ఇదంతా జరిగిందని ఆందోళన చేశారు. అక్కడున్న ఫర్నిచర్‌ను ఎత్తేశారు. తమకొడుకు మరణానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు రాకముందే మృతదేహాన్ని కిందకు దించి ఎలా తరలించారని ప్రశ్నించారు. ఆత్మహత్యకు ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న అనుమానాలు వ్యక్తం చేశారు. డీఎస్పీ మహేశ్, సీఐలు ప్రవీణ్‌కుమార్, చంద్ర శేఖర్, బాలాజీలు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పారు. తమ కుమారుడి మృతికి కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బందే కారణమని మృతుడి తండ్రి హన్మంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ చెప్పారు.

గౌరారంలో గడ్డివాము, ఎడ్ల బండి అగ్నికి ఆహుతి

తెలకపల్లి, జనవరి 1 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని గౌరారంలో గడ్డివాము, ఎడ్లబండి అగ్నికి ఆహుతి అయ్యాయి. సోమవారం వరి పొలాల్లో ప్రమాదవశాత్తు వరి గడ్డి అగ్నికి ఆహుతి అయింది. గడ్డి అంటుకుంటూ వెళ్లి బండిపైన ఉన్న గడ్డి కూడా అగ్నికి ఆహుతి అయింది. దీని విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన పుల్లయ్య అనే రైతుకు చెందిన బండి వరిగడ్డి కాగా, మిగతా రైతులు లక్ష్మయ్య, రామకృష్ణ, చంద్రయ్య తదితరుల పొలాల్లో ఉన్న గడ్డి కూడా అగ్నికి ఆహుతి అయింది.

యువకుడిపై కత్తితో దాడి

- కేసు నమోదు

పెంట్లవెల్లి, జనవరి 1 : యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... పెంట్లవెల్లి గ్రామానికి చెందిన యువకుడు కొల్లాపూర్ మండలం చౌటబెట్ల గ్రామానికి చెందిన యువకుడితో పాత గొడవలున్నాయి. ఆదివారం రాత్రి ఒకరికొకరు ఫోన్‌లు చేసుకుని పెంట్లవెల్లికి సమీపంలో ఉన్న బ్రహ్మంగారి గుడి దగ్గర కలుసుకున్నారు. ఒకరిపై ఒకరికి మాట పెరగడంతో పెంట్లవెల్లికి చెందిన గిరిధర్ (22)పై చౌటబెట్లకు చెందిన హేమంత్ కత్తితో దాడి చేశాడు. పొట్ట భాగంలో పొడవడంతో కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 1 : రోడ్డు ప్రమాదంలో యువకుడు శివకుమార్(25)మృతి చెందినట్లు ఎస్ఐ మహేందర్ సోమవారం తెలిపారు. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం బాడుగదిన్నె గ్రామానికి చెందిన శివకుమార్ ఆదివారం రాత్రి సొంత గ్రామం నుంచి నాగర్‌కర్నూల్ వస్తుండగా పెద్దముద్దునూర్ గ్రామ శివారులో నాగర్‌కర్నూల్ నుంచి పెంట్లవెల్లి వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలైన శివకుమార్‌ను చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● కేసరి సముద్రంలో పడి

నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని కేసరి సముద్రంలో తూమ్ దగ్గర పడి వ్యక్తి మౌలాలి(45) మృతి చెందినట్లు ఎస్ఐ మహేందర్ సోమవారం తెలిపారు. మృతుని దగ్గర ఉన్న ఆధారాలను బట్టి కొత్తకోటకు చెందిన మౌలాలిగా గుర్తించారు. మృతుని బంధువులకు సమాచారమందించగా ఉదయం ఇంటి నుంచి వెళ్లాడని పేర్కొన్నారు. ఉదయం ఇంటి నుంచి వెళ్లిన మౌలాలి సాయంత్రం శవమై కన్పించడంతో బంధువులంతా శోకసంద్రంలో మునిగినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా భీమా కోరేగావ్ వీరుల దివస్



నాగర్‌కర్నూల్‌లో భీమా కోరేగావ్ అమరులకు నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ ఐడియాలజీ మిషన్ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి1: అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో భీమా కోరేగావ్ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భీమా కోరేగావ్ అమరవీరుల స్థూప చిత్రపటానికి మిషన్ అధ్యక్షుడు టి.మద్దిలేటి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ సభ్యులు మద్దిలేటి, శోభన్‌బాబు, కృష్ణయ్య, చంద్రయ్య, వెంకటస్వామి, చెన్నయ్య, రాము, నరసింహ, సంజీవ్, వినోద్, రవి, శివుడు, క్రాంతి, బాలసుబ్రమణ్యం, ఈశ్వర్, సాయిబాబు, రాజు అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటటౌన్: పీష్వా బ్రహ్మణులపై మహర్ పోరాట యోధులు యుద్ధ విజయానికి చిహ్నమే భీమా కోరేగావ్ అని మాల మాహానాడు నాయకుడు పాత్కల శ్రీశైలం, నియోజకవర్గ నాయకుడు సందీప్ అన్నారు. భీమా కోరేగావ్ శౌర్యదివస్‌ను సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో భీమా కోరేగావ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దళితుల ఆత్మగౌరవం నిలిచి గెలిచిన రోజైనందున దేశ వ్యాప్తంగా జనవరి 1న శౌర్యదివస్‌గా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు ఐకమత్యంతో ముందుకు సాగాలి

- ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ



ఆర్యవైశ్యుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, లయన్స్‌క్లబ్ నేత జూలూరి రమేష్‌బాబు

కల్వకుర్తి, జనవరి 1: ఆర్యవైశ్యులందరూ ఐకమత్యంతో ముందుకు సాగాలని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో 2024నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ జూలూరి రమేష్‌బాబు, ఆ సంఘం నాయకులు హాజరై ఆవిష్కరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్య సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉద్యమిస్తేనే తమ హక్కులను సాధించుకోవచ్చని సూచించారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లాలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కలిమిచెర్ల రమేష్, కోశాధికారి శివ జగదీశ్వర్, అదనపు కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంప శ్రీనివాస్, పీఆర్వో మిరియాల రాజయ్య, వాస శేఖర్, శివాలయం శ్రీనివాస్, వెంకటేశ్, ప్రవీణ్, అవోపా అధ్యక్షుడు సతీష్, వాసవిక్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌తోపాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మారుమోగిన అయ్యప్ప నామస్మరణ



స్వామికి పంచామృతాలతో అభిషేకం చేస్తున్న అయ్యప్ప స్వాములు

బిజినేపల్లి, జనవరి 1 : మహాపడి పూజోత్సవంలో భక్తులు అయ్యప్ప స్వామి నామస్మరణతో శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం మారుమోగింది. మండల కేంద్రంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం మహా పడిపూజ కార్యక్రమాన్ని దేవస్థాన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు కనుల పండువగా చేశారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించిన పలువురు దాతలను పూలదండలు, శాలువాలతో సన్మానించారు. ప్రతియేటా మహా పడిపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, శబరిమలలో స్వామివారికి ఏవిధంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారో అదే తరహాలో ఆలయంలో చేపపడుతున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం స్వామిని 18 కలశాలతో ప్రత్యేక పూజలు చేసేందుకు భక్తులు వేలంలో కలశాలను దక్కించుకొని స్వామికి అభిషేకాలు చేశారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పులేందర్ రెడ్డి, ఇండ్ల శ్రీను, కుమ్మరి శ్రీను, పూన్యానాయక్, తుమ్మల వెంకటయ్య, కుమ్మరి రాజు, శేఖర్, సురేందర్, రాజేందర్‌గౌడ్, అనంతరెడ్డి, అంబాజీ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మంత్రి జూపల్లి



రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రి

కొల్లాపూర్, జనవరి 1 : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని సోమవారం తన నివాస గృహంలో రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 2024సంవత్సరంలో రాష్ట్ర ప్రజలందరికీ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని, అర్హులైన వారికి న్యాయం చేస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. 2024 సంవత్సరంలో రాష్ట్ర ప్రజలతో పాటు కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు, రైతులకు, కార్మిక, కర్షకులకు అంతా మేలు కలుగుతుందని కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతుందని పేర్కొంటూ నియోజకవర్గ ప్రజలందరికీ మంత్రి జూపల్లి కృష్ణారావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపీడీవో మృతి తీరని లోటు



ఎంపీడీవో జయసుధ మృతదేహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారి

ఊర్కొండ, జనవరి 1: చారకొండ ఎంపీడీవో జయసుధ మృతి తీరని లోటని జడ్పీ చైర్ పర్సన్ శాంత కుమారి అన్నారు. ఎంపీడీవో స్వగ్రామమైన ఊర్కొండలో పార్థీవదేహం వద్ద ఆమె నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఎంపీడీవో కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి: చారకొండ మండల ఎంపీడీవోగా పని చేస్తున్న జయసుధ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందింది. విషయం తెలుసుకున్న కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కల్వకుర్తి పట్టణంలో మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీడీవో జయసుధ పార్థీవదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో ఆకస్మిక మృతి ఆ కుటుంబానికి తీరని లోటని చైర్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, పలువురు నాయకులు జయసుధ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- ఉమామహేశ్వర క్షేత్రంలో భక్తజన సందోహం

- కొండ దిగువన బోగ మహేశ్వరం వద్ద వాహనాల నిలిపివేత

- సిద్దాపూర్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం

అచ్చంపేటఅర్బన్, జనవరి 1: ఉమామహేశ్వర క్షేత్రానికి 2024 నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నల్లగొండ, హైదరాబాద్, ఉమ్మడి మహబూబ్‌నగర్, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. సోమవారం ఈశ్వరుడికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. దాదాపు 10 వేలు నుంచి 15 వేలకు పైగా భక్తులు వచ్చారు. ముం దుగా పాపనాషిని గుండంలో పుణ్య స్నానాలు ఆచరించి ఈశ్వరుడికి క్షీరాభిషేకం, రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన గణపతి అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసాద్ ఉమామహేశ్వర క్షేత్రానికి 8 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీ పెరగడంతో అచ్చంపేట డీఎస్పీ కృష్ణకిషోర్, సీఐ అనుదీప్ ఆదేశాల మేరకు ఎస్సైలు గోవర్ధన్, శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో 30 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను కొండ పైకి వెళ్లకుండా కొండ దిగువ ఉన్న బోగమహేశ్వరం వద్దనే నిలిపివేశారు. దాదాపు కిలోమీటర్లు మేర వాహనాలు నిలిచిపోయాయి. సిద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆలయం ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్‌లు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా ఏర్పాట్లను పరిశీలించారు.

వట్టెం వెంకన్న ఆలయంలో..

● బిజినేపల్లి: నూతన సంవత్సరం మొదటి రోజు కావడంతో పాటు ధనుర్మాసం గోదాదేవి ప్రత్యేక పూజల్లో సోమవారం పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు చేసేందుకు ఆలయాలకు తరలి రావడంతో భక్తుల సందడితో దేవాలయాలు కిట కిటలాడాయి. మండల కేంద్రంతో పాటు పాలెం, వట్టెం, నంది వడ్డెమాన్ లలోని ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. వట్టెం వెంకన్న సన్నిధిలో బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి బంగారు శ్రుతి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తులు కొత్త సంవత్సరం మొదటి రోజు దైవ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు చేస్తే అంత మంచే జరుగుతుందని విశ్వాసం. దీంతో ప్రజలంతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టేందుకు ఆలయాల బాట పట్టారు.

● అచ్చంపేటటౌన్: కొత్త సంవత్సరంలో తెల్లవారు జామునుంచే పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంతో పాటు భ్రమరాంబికా ఆలయం, భక్తమార్కండేయ, సాయిబాబ, శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలో యువతీ యువకులు అర్ధరాత్రి పలు కాలనీలలో కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

● కల్వకుర్తి: డివిజన్ పరిధిలో ప్రజలు, నాయకులు, యువతీ యువకులు ఆనందోత్సాహాల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. అర్ధరాత్రి 12గంటల తర్వాత కేకులు కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబురాలు జరుపుకున్నారు. కల్వకుర్తి పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయాన్నే కొంతమంది తమ ఇళ్ల ముందు 2024కు స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు, సీఐ ఆంజనేయులు, ఎస్ఐ రమేష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు పర్యవేక్షించారు.



ఉమామహేశ్వర ఆలయంలో దర్శనం కోసం క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు తమ మొక్కులను చెల్లించుకొని సామూహిక వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయం సిబ్బంది వరలక్ష్మి, శ్రీశైలం, రవికుమార్, అర్చకులు దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్ శర్మ, శ్రీనివాస్ శర్మ మహేష్ శర్మ, తదితరులు ఉన్నారు.

సోమశిలలో కిక్కిరిసిన పర్యాటకులు

● కొల్లాపూర్: నూతన సంవత్సరపు వేడుకలను కొల్లాపూర్ మండల ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే ఒకరికొకరు నూతన సంవత్సరపు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ గ్రామాల్లో, పట్టణ కేంద్రాల్లో ఉన్న ఆలయాల్లో పూజలు నిర్వహించి దైవ దర్శనం చేసుకున్నారు. కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో లలితాంబిక సోమేశ్వరాలయాన్ని, పర్యాటక ప్రాంతాన్ని సందర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సోమశిల గ్రామంలో వాహనాలతో కిక్కిరిసిపోయింది. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాటేజీల్లో బహిరంగ ప్రదేశాల్లో విందు వినోదాలు నిర్వహించుకుని పర్యాటకులు నూతన సంవత్సరపు వేడుకలను కుటుంబ సమేతంగా బంధుమిత్రులతో ఆహ్లాదంగా గడిపారు. మండల పరిధిలోని సింగోటం గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చేరుకుని నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కొల్లాపూర్ మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామంలో జడ్పీటీసీ సభ్యురాలు జూపల్లి భాగ్యమ్మ, సింగిల్ విండో డైరెక్టర్ జూపల్లి రఘుపతిరావులు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అదేవిధంగా కొల్లాపూర్ పట్టణంలోని నివాస గృహాల్లో చిన్నారులు నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేకులు కట్ చేసి తమ నివాస గృహాల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు.



పాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కుడికిళ్ల గ్రామంలో కేక్ కట్ చేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు జూపల్లి భాగ్యమ్మ

అభయుడి ఆలయంలో..

● ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. నూతన సంవత్సరం పురస్కరించుకుని పరిసర గ్రామాలతో పాటు ఆలయం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయం పరిసరాలు కిక్కిరిసినవి. తెల్లవారుజామున స్వామి

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో

నూతన సంవత్సర వేడుకలను సోమవారం కొల్లాపూర్ పట్టణంలో ఏఐటీయూసీ ట్రాలీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆటో స్టాండ్ వద్ద సీపీఐ పట్టణ కార్యదర్శి ఎండి.యూసుఫ్ పాల్గొని ట్రాలీ ఆటో యూనియన్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి వారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

యూనియన్ నాయకులు దాసు, కృష్ణ, యూ సుఫ్, భాస్కర్, వినయ్, చంద్రయ్య, సురేష్, సంతోష్, ఖాజా, శివ, చాంద్‌పాష, యాదగిరి, రమేష్, కృష్ణ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేట ఆదర్శ నగర్ కాలనీలో అర్ధరాత్రి కేక్ కట్ చేస్తున్న మహిళలు



నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎస్ఐ రమేష్



సోమశిల గ్రామంలో కృష్ణానది తీరాన ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన పర్యాటకులు

గడపగడపకు పూజిత అక్షింతల పంపిణీ

పెద్దకొత్తపల్లి, జనవరి 1 :మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో సోమవారం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో గడపగడపకు పూజిత అక్షింతల పంపిణీ చేసినట్లు ట్రస్టు సభ్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు అయోధ్య వారి ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 15వరకు శ్రీరామ మందిర నిర్మాణ నమూనా ఫొటో, ఒక కర పత్రం, పూజిత అక్షింతలను గడపగడపకు చేరవేసే కార్యక్రమంలో భాగంగా పెద్దకొత్తపల్లిలో పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఇంటికెళ్తూ పూజిత అక్షింతల ప్రాధాన్యతను తెలియజేస్తూ రామమందిర విశిష్టతను తెలియజేస్తూ జనవరి 22వ తేదీన అయోధ్యలో జరిగే బలరాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి గ్రామంలో, ప్రతీ ఇంట్లో పండుగ వాతావరణంలో ఉత్సాహాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఆ రోజు రాత్రి ప్రతీ ఇంటి ముందు కనీసం ఐదు దీపాలు వెలిగించాలని ఆయన కోరారు. ట్రస్టు సభ్యులు శోభ, విమల, కవిత, స్వాతి, సంధ్య, సువర్ణ, శారద, రఘుపతిరెడ్డి, శేఖర్, శ్రీకాంత్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను ఉప్పునుంతల మండల కేంద్రంలో సోమవారం సర్పంచ్ సరిత, అనంత రెడ్డి దంపతులు, మహిళలతో కలిసి గడప గడపకు అక్షింతలు అందజేశారు. అక్షింతలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారన్నారు. గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో శ్రీరామ పూజిత అక్షింతల పంపిణీ చేస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు

ప్రజా పాలనకు దరఖాస్తుల వెల్లువ

- అన్ని పథకాలకు దరఖాస్తులు

అచ్చంపేట, జనవరి 1: ప్రజా పాలన ద్వారా తీసుకుంటున్న దరఖాస్తులకు ఇప్పటికే లబ్ధిపొందుతున్న లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటుడడంతో ఒక్కో గ్రామంలో జనాభా ఎంత ఉంటే అంతకు చేరువలో దరఖాస్తులు అందుతుడడం గమనార్హం. ఎవరు దరఖాస్తు చేయాలి ఎవరు చేయకూడదు అన్న అవగాహన లేకపోవడమే వీటంనిటికీ కారణంగా తెలుస్తున్నది. గ్రామాల్లో ఒకరిని చూసి ఒకరు దరఖాస్తులు చేసుకుంటున్నారు. గత ఏడాది డిసెంబరు 28నుంచి ప్రారంభమైన ప్రజా పాలన రెండు రోజుల్లోనే జిల్లాలో 45,499 దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తున్నది. ఈ సంవత్సరంలో జనవరి 2 నుంచి 6వరకు ప్రజాపాలన దరఖాస్తులు మళ్లీ ప్రజల నుంచి తీసుకుంటున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశాలున్నాయి.

ఈ కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి మీసేవ, జిరాక్స్ సెంటర్లలో జిరాక్స్‌ల కోసం ప్రజలు ఎగబడుతున్నారు. దరఖాస్తుల విధివిధానాలను ముందుగానే గ్రామాల్లో టాంటాం వేయించి ఉండి ఉంటే ఇంత పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చేవి కావు. ప్రతి పథకానికి ప్రతీ ఒక్కరు దరఖాస్తులు చేసుకుంటున్నారు. చేయకపోతే మాకు వచ్చే పథకం కట్ అవుతుందోనన్న ఆందోళన ఆయా లబ్ధిదారుల్లో నెలకొంది.



దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు(ఫైల్)

ఆలయ అభివృద్ధికి మొదటి నెల వేతనం

తిమ్మాజిపేట, జనవరి 1: మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామ సమీపంలో నరసన్నగుట్టపై వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ఆర్మీ జవాన్ తన మొదటి నెల వేతనమిచ్చి ఉదారత చాటుకున్నాడు. తమ కుమారుని మొదటి నెల వేతనం అందజేసిన సైనికుడి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. అప్పాజీపల్లి గ్రామానికి చెందిన జల్లి రామచంద్రయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు రాఘవేందర్‌కు ఆర్మీలో ఉద్యోగం వచ్చిన సందర్భంగా మొదటి నెల వేతనం 21,016రూపాయలను దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ జల్లి తిరుపతమ్మ, ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, ఎల్లారెడ్డి, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు దుస్తుల పంపిణీ



జిల్లా కేంద్రంలో అనాథ పిల్లలకు దుస్తులు అందజేస్తున్న జ్ఞాన వికాస భారతి సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 1: జ్ఞాన వికాస భారతి సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. జ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మార్కెట్ చైర్మన్ దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, వేముల సురేష్ చేతుల మీదుగా దుస్తులను అందజేశారు. జ్ఞాన వికాస భారతి వ్యవస్థాపక అధ్యక్షుడు జీఎం.బాలబ్రహ్మచారి, ఉపాధ్యక్షురాలు ప్రగతి, ప్రధాన కార్యదర్శి సుధారాణి, నరేందర్, రాధిక, సాయిలక్ష్మి, శిరీష, ఇందుమతి, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆర్డీవో



ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని సన్మానిస్తున్న కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను

కల్వకుర్తి, జనవరి 1 : కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిని ఆర్డీవో ఎస్.శ్రీను, నియోజకవర్గంలోని పలువురు తహసీల్దార్లు సోమవారం కలిసి పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన సేవలందాలంటే అధికారులపైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, వెల్దండ తహసీల్దార్ రవి తదితరులు ఉన్నారు.

ధనుర్మాస ప్రత్యేక పూజలు

కందనూలు, జనవరి 1 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం సోమవారం నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ధనుర్మాసం కావడంతో ప్రత్యేకంగా తెల్లవారుజామున గోదాదేవిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు. స్వామిఅమ్మవార్లకు దర్శనానికి తెల్లవారు జాము నుంచి దర్శించుకుంటున్నారని ఆయన తెలిపారు. ఆలయం లోని పరమశివునికి ప్రత్యేక అభిషేకాలు భక్తులు చేస్తున్నారని తెలిపారు. దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు కందాడై శ్రీనివాసాచార్యులు, గోమటం మురళీమోహన్‌ఆచార్యులు, గోమటం శ్రీనివాసచార్యులు, కే.వేణుగోపాల్, కరుణశ్రీ, పద్మావతి, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్వకుర్తి, జనవరి 1 : కల్వకుర్తి మునిసిపాలిటీలో పారిశుధ్య విభాగం పొరుగు సేవల పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న గోరటి వెంకటయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మృతుని కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి నివాళులర్పించారు. మునిసిపల్ తరఫున మృతుని అంత్యక్రియల ఖర్చులకు రూ.పదివేలు ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.పదివేలు మొత్తం 20వేలు మృతుని కుటుంబానికి చైర్మన్ ఎడ్మ సత్యం ఆర్థిక సహాయం అందజేశారు. చైర్మన్ వెంట పలువురు మునిసిపల్ సిబ్బంది, పలువురు నాయకులు ఉన్నారు.

లిటిల్ సోల్జర్ యూత్ క్యాలెండర్ ఆవిష్కరణ

కోడేరు, జనవరి 1 : మండల కేంద్రంలోని లిటిల్ సోల్జర్ యూత్ క్యాలెండర్‌ను సోమవారం ఉదయం నమస్తే తెలంగాణ సీనియర్ విలేకరి లాలయ్య ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లిటిల్ సోల్జర్ యూత్ నాయకుడు శ్రీకాంత్ మాట్లాడుతూ మా లిటిల్ సోల్జర్స్ యూత్ ఆధ్వర్యంలో పేద, నిరుపేద ప్రజలకు, అనాథ పిల్లలకు ప్రమాదంలో మృతి చెందినట్లు కుటుంబాలకు తమ వంతు సహాయం చేస్తున్నామన్నారు. ఈ విధంగా సామాజిక సేవలు చేయడం ఆనందంగా ఉందన్నారు.

అన్నారంలో భగవద్గీత ప్రచారం

వంగూరు, జనవరి 1 : వంగూరు మండలం అన్నారం గ్రామంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ప్రబోధ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సభ్యులు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు మనోహర్, సాయిశంకర్, రాము, సిద్దార్థ, రమాదేవి, పార్వతమ్మ, శిరీష, స్వప్న, వెంకటయ్య, తిరుపతి, మంజుల, శిరీష తదితరులు ఉన్నారు.

నేడు పేదలకు బియ్యం, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కల్వకుర్తి, జనవరి 1 : కల్వకుర్తి మునిసిపల్ పరిధిలోని సిలార్‌పల్లిలో పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చిగుళ్లపల్లి సతీష్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని 135 మందికి 25కేజీల బియ్యం చొప్పున, 15మంది విద్యార్థులకు సైకిళ్లపంపిణీ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని పలువురు సద్వినియోగం చేసుకోవాలని సతీష్‌కుమార్, కోరారు.

5న జిల్లా ఆసుపత్రిలో కంటి వైద్యశిబిరం

కందనూలు, జనవరి 1: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో ఈ నెల 5న శుక్రవారం ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి తెలిపారు.

శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత క్యాటరాక్ట్ కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. సాధారణ పరీక్షలు, బీపీ, షుగర్, కరోనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని రిపోర్టుతో శిబిరానికి రావాలని కోరారు. తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు తెచ్చుకోవాలని తెలిపారు.